# జ్వాలా తోరణం

ఎత్తైన ఆకాశంనిండా వర్గ వైషమ్యంలా చిక్కగా పరుచుకుని వున్నాయి. నల్లని చీకటి మేఘాలు. జ్ఞాన భాస్కరుడు యింకా దిక్చక్రముపై దర్శనం యివ్వకపోయినా ఆయన కాంతిచ్ఛటలు సోకడంవల్ల కాబోలు ఆ మేఘాల అంచులు అమాయకపు జీవుల చిక్కని రక్తంతో తడిసినట్లు ఎర్రగా వెలుగుతున్నాయి. దయామయుడైన లోకేశ్వరుని దరహాసంలా తూర్పుదిక్కు తెల్లగా అప్పుడే వికసిస్తోంది. చుట్టుపక్కల చెట్లమీద వున్న పక్షి సంతానాలకి జాతి ప్రాంతవర్గ భేదాలు లేనట్లున్నాయి. అన్నీకలిసి ఒకే శ్రుతిలో అవ్యక్త మధురంగా వైతాళిక గీతాలు పాడుతున్నాయి.

"మళ్ళీ తెలారుతోంది. తిరిగి అల్లరులూ అలజడులూ ప్రారంభం కాబోలు భగవంతుడా! అని ప్రకృతిమాత బాధగానూ, భారంగానూ విడుస్తూన్న నిట్టూర్పులులా

సన్న సన్నగా గాలి వీస్తుంటే, ఆ గాలిలో జట్లు కట్టాలు వేసుకొని కలిసిపోయి చుట్టుపట్ల అంతా వ్యాపిస్తున్నాయి. ఆచార్లు గారి పెరట్లో రాలి పడిన పారిజాత పరిమళాలూ, మాల్వీగారి సహాన్‌లో అప్పుడే వికసిస్తూన్న గులాబీల గుబాళింపులూను.

పరిసరం అంతా కురుక్షేత్ర సంగ్రామానికి ముందున్న వుద్రిక్త వాతావరణంలా అతి గంభీరంగా వుంది. బాల శైశుభానుడింకా ప్రాగ్దిశమాతపురిటి పొత్తిళ్ళలోంచి లేవ లేదు.

పూరిపాకలో చింకి చాపమీద పడుకొని వున్న కరుణమ్మ మాత్రం ఎవరో తట్టి లేపినట్లు ఒక్క ఉదుటున లేచింది "హమ్మో, అప్పుడే తెల్లారిపోయిందే అని కంగారు పడుతూ నీరసం వల్ల శుష్కించినా, యిరవై రెండేళ్ళ యౌవనం తాలూకు మిసిమి, కళ్ళలోనూ, బుగ్గల్లోనూ తళుక్కు మంటూంటే నుదుటిమీద పడుతూన్న ముంగురుల్ని సన్నగా పొడుగ్గా వున్న లేత వేళ్ళతో వెనక్కి తోసుకుంటూ ఒళ్ళు విరుచుకుంది బద్ధకంగా.

నడ్డి బాగా వంచి వంగిపోయిన చూరులోంచి ఇవతలికి దూరివచ్చి, ఆకాశంలో కనిపించకుండా ఉండిపోయిన దేవుడి వైపు రెండుచేతులు ఎత్తి దణ్ణం పెట్టింది ముంతలో వున్న నీళ్ళతో ముఖం కడుక్కొని చూరులో వుంచిన గెడ చీపురు తీసుకుని బయలుదేరింది. వీధులు తుడిచి శుభ్రంచేసే తన మామూలు కార్యక్రమం ప్రారంభించేదుకు.

జారెడు పొద్దెక్కిందేమో, సూర్యుడి వాడి కిరణాలు ఏటవాలుగా పడి చెంపలు చుర్రుమంటున్నాయి. మూడు పూటలనుంచి తిండలేని కారణంగా కడుపులో ఆకలి కాల్చేస్తోంది. నిన్నా, మొన్నా జరిగిన సంఘటనల తాలూకు జ్ఞాపకాలు మనస్సుని మండించేస్తున్నాయి. ఇలా బయటా లోపలా నాలికలు జాపుకుంటూ వేస్తూన్న జ్వాలలకి తట్టుకోలేక కరుణమ్మ సుకుమార ప్రాణం విలవిల్లాడుతూ కోడి పిల్లలా గిలగిలా కొట్టుకుంటోంది.

చేతిలోవున్న చీపురయితే అలవాటు ప్రకారం వీధుల్ని తుడిచి చెత్తనంతటినీ వోవారకి పోగెడుతోంది కాని కరుణమ్మ మనస్సు మాత్రం చిందరవందరంగా వున్న ఆలోచనలన్నింటినీ అర్థవంతమైనవో వరుసలోకి చేర్చలేకపోతోంది. ఎంత వద్దని తోసేసుకుంటున్నా వదలకుండా పగబట్టిన నాగుపాముల్లా జ్ఞాపకాలు తనని వీక తరుముతున్నాయి. భయంకరమైన జ్ఞాపకాలు నిలువెల్లా వణికించేస్తూ తన మెత్తని మనస్సుని కసిదీరా కాటేసే జ్ఞాపకాలు.

“అ...బ్బ”

కరుణమ్మ గట్టిగా అరిచింది.

నిజంగానే తన కాలినేదో కాటేసింది. పాదం అడుగు నుంచి రక్తంకూడా కారుతోంది. కరుణమ్మ గజగజా వణికిపోయింది. ఒళ్ళంతా ముచ్చెమటలు పోసాయి. కంగారుగా చేతిలో వున్న చీపుర్ని పక్కనేవున్న చెత్త కుండీకి జేరేసి పాదం ఎత్తి చూచుకుంది.

హా...మ్మ...య్య.

ప్రాణం కుదుటబడింది. తననికాటేసింది పామేంకాదు సూదిగా, వాడిగా వున్న గాజు పెంకు.

ఆ గాజు పెంకు విదేశాల్లో తయారైన ఖరీదైన గాజు సీసా తాలూకు ముక్క అనీ, సీసాలో ఒక భాగంగా అది వున్నప్పుడు వందలు కిమ్మత్తుచేసే 'వైన్'ని తనలో భద్రపర చిందనీ, ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసులో ఆఫీసరుగారితో కలిసి ఆనందంగా ఆ ద్రవాన్ని సేవించి, దాని బరువుతో పాటు తనమీాద పడిన ఇన్‌కమ్‌టాక్స్ బరువునికూడా తగ్గించుకుని ఆ ఎదురుగుండా వున్న అయిదు అంతస్తుల ఆసామీా పాంటి యాక్కులో యింటికి వస్తుంటే, ఆయనమజా చేతుల్లోంచి, జారిపడి భళ్ళుననవ్విన సీసా బాపతు వారసురాలు ఈ గాజు పెంకు అనీ కరుణమ్మ కేం తెలుసు? యింత ఖరీదైన గాజు ముక్క చరిత్ర తెలియదు కనకే తన కాలిలోంచి బలవంతంగా లాగి మళ్ళీ అదిఇ కెవర్ని కాటెయ్యకుండా ఉండడం కోసమని దానిని విసిరి చెత్త కుండీలో పడేసింది కరుణమ్మ.

ఒక్క గాజుముక్కనే అన్నమాటేమిటి? ఆ తర్వాత, సంఘం తనకోసమని ఆమూడుగా తయారుచేసి సిద్ధంచేసిన ప్రతి నిర్మాల్యాన్నికూడా, ఆ వీధిలోంచి తొలగించి వీధిని పరి శుభ్రంగా అద్దం తయారుచేయసాగింది కరుణమ్మ.

అసమర్థుడైన తన బావమరిదికి అత్యున్నతమైన పదవిని ఇయ్యావలసిందంటూ వో రాజకీయ నాయకుడు రాష్ట్ర ముఖ్యోద్యోగికి రాసిన సిఫార్సు ఉత్తరం, తన లక్ష్యాన్ని తాను జయప్రదంగా సాధించి ముక్క ముక్కలుగా విడ

పోయి, రోడ్డుపక్క గాలిలో ఆనందంగా తేలిపోతూంటే, ఆ ముక్కలన్నీ వోచోటికి పోగుపెట్టి, ఆ రాజకీయ నాయకుడి పరువునిఆ రాష్ట్రీదో్యగ్రప్రతిష్టనిభద్రంగాకాపాడిందికరుణమ్మ

అలాగే, కుళ్ళిన అరటిపళ్ళ గెలని కుండీలో పడేసి దానిని సమర్పించిన కంట్రాక్టరుగారి గౌరవాన్ని స్వీకరించిన ఆ పక్కింటి మేనేజరుగారి మర్యాదనే బజారుపాలు కాకుండా భద్రపరచింది. లేకపోతే, సిమెంటు లేకుండా కేవలం ఇసుకతోనే తమాషాగా వంతెనలు నిర్మించేకంట్రాక్టరుగారి నేర్పరితనమూ. పచ్చగడ్డి మొదలు పచ్చులపతకం దాకా దేన్నైనాసరే నిరభ్యంతరంగా దానం పట్టేసే మేనేజరుగారి ఉదార హృదయమూ కుళ్ళిన అరటిపళ్ళ గంసు ధంలా లోకం అంతా ఒక్కమారు గుప్పుమంటూ వ్యాపించి వుండేది...

అలా కరుణమ్మ యింకా చాలావస్తువుల్ని తొలగించి వీధిని శుభ్రం చేయసాగింది. తనకి గుప్పెడు అన్నాన్ని సంపాదించి పెట్టలేకపోయాయనే. కోపంతో ఒక ప్రసిద్ధరచయిత వీధిలోకి విసిరేసిన రచనల తాలూకు కాగితాన్ని, ఆచార్లుగారి చేతిలో అందంగా రూపం దిద్దుకొని, గుళ్ళో దేవుడి మెళ్ళో గుబాళించడానికి బదులు ఊళ్ళో దేవదాసీతల్లో రాత్రంతాపరిమళించి ఆచార్లుగారి రసికహృదయాన్ని పరవశింపజేసి, తెల్లవారేసరికి రోడ్డుప్రక్కకి వచ్చి వెల్లకి పడిపోయిన వాడిన పువ్వుల దండనీ, ఆకలిబాధకి తట్టుకోలేక అమ్మ తలవద్ద ఆకృత్యానికి ఫలితంగా ఆసిలోకంలోకి వస్తే, వచ్చిన మరుక్షణంలోనే ఏడుస్తూ తన అమ్మే తన పీకరపా

స్వంగా పులిమేస్తే ఏమిటో అర్థంకాక గుడ్లు తేలేసి వికృతంగా పెంటకుప్పమీద కూలిపోయిన పసినిసుగు లేత శవభాగాల్ని శ్రీమంతుడి మోచెయ్యి తగిలి భళ్ళుమని ముక్కలైన ముష్టి వాడి మట్టి మూకుడినీ, పంచభక్ష్య పరమాన్నాల్ని అదృష్ట వంతుడికి పంచి యిచ్చి, ఆకలి కుక్కలమధ్య తన కడుపు చింపుకొన్న ఎంగిలాకునీ, గత వైభవాన్ని కోల్పోయిన చింపిరి గుడ్డల్ని, కొట్లాటల్లో విరిగి ముక్కలైన చేతికర్రల్ని. కల్లోలాన్ని సృష్టించే కరపత్రాల్ని-యిలా ఒకటేమిటి తన కోసం అని అవిధిలోని మనుష్యులు తయారుచేసిసిద్ధంగావుంచిన ప్రతి పాపాన్ని తన చేతుల్తో తీసి దూరంగా పారేసి, పిల్లల తప్పుల్ని కడుపులో పెట్టుకొని కాపాడే తల్లిలా, కరుణమ్మ ఎండనడి నెత్తిమీదికి వచ్చేదాకా శ్రమించసాగింది.

తారాజువ్వలా లేచిన ఎండ కమర్మ కొలిమిలా మండి పోతుంది. అసలే నీరసంగా వున్న కరుణమ్మకి పొద్దుటినుంచీ పడిన శ్రమవల్ల మరింత నీరసం వచ్చి శోషకొట్టినట్లయింది. జుట్టూ, మొహం ఒళ్ళూ అంతా నీళ్ళలో మునిగివచ్చినట్లు చెమటతో తడిసిపోయాయి. ఎదురుగుండా ఎవరో మారాజు కట్టిన మేడ కనిపిస్తే దాని నీడలోకి వెళ్ళి నిల్చుంది.

హమ్మయ్య.

ప్రాణం లేచి వచ్చినట్లయింది. అప్పుడే ఎక్కడినుంచో గాలి తెర ఒకటి వచ్చి కరుణమ్మ చెంపలు నిమిరి వెళ్ళింది. దాంతో, పడిన శ్రమ అంతా ఒక్కక్షణం పటాపంచలైంది. సుఖానుభూతిలో కరుణమ్మ కనురెప్పలు కొద్దిగా మూతలు పడ్డాయి.

కాని ఆ సుఖంలో మాత్రం స్థిమితం ఏదీ?

కనురెప్పలు యిలా మూసిందో లేదో ఎదురుగుండా పీడకలల్లా భయంకరమైన జ్ఞాపకాలు నిన్నా మొన్నా జరిగిన భయంకరదృశ్యాల తాలూకు బాధాకరమైనజ్ఞాపకాలు.

పదిమంది కీచకుల చేతిలో కుక్కలుచింపిన విస్తరలా సతీత్వం కాస్తా ముక్కలైపోగా తన గుమ్మంలో తనే అనాధగా ఒరిగిపోయి ప్రాణాలు వదిలేసిన అమ్మ.

అర్థరాత్రి అల్లరిమూక కాల్చేసిన యిళ్ళ శ్మశానపు అవశేషాల్లో మంచంతో సహా కాలిపోయి నల్లని బొగ్గుల్లా మాడిపోయినా కొత్త దాంపత్యపు కౌగిలి మాత్రం వీడని అన్నయ్యా, వదినా—

'అక్క ఒళ్ళో కెళుతున్నానే' అంటూ బంతిలా వీధిలోకి గెంతిన అయిదేళ్ళ ఉత్సాహం వీపులోంచి దూసుకుపోయిన తుపాకీ గుండూ, దాంతో నెత్తురు కక్కుకున్న మాంసపు ముద్దలా కూలిపోయిన పసి తమ్ముడూ!

అల్లరిమూకల అట్టహాసాలు

అమాయక జీవుల ఆక్రందనలూ హత్యలూ, అలజడులూ, లూటీలూ – గృహదహనాలూ.

కూలిన గోడలమధ్య చచ్చిన మనుష్యుల చుట్టూ బెదిరిన చూపులూ, చెదిరిన గుండెలూ, విరిగిన మనసులూ, ఒరిగిన బ్రతుకులూ.

కొట్టు! నరుకు!! చంపు!!!

అయ్యో - అయ్యో.

భయంతో గట్టిగా ఒక పిచ్చిఅరుపు అరిచి కంగారుగా కళ్ళు తెరచింది కరుణమ్మ.

ఎదురుగుండా మొన్నటి అల్లరిమూక.

కరుణమ్మ పై ప్రాణాలు పైనే పోయాయి. వెన్నులో జివ్వుమని భయం ప్రవహించింది. జల్లుమన్న శరీరం ప్రాణం లేనట్లు అచేతనంగా వుండిపోయింది. మానవత్వం అనే కుబుసాన్ని విడిచివచ్చిన నల్లత్రాచులులా వున్నారు. వాళ్ళు, వాళ్ళ ముఖాలు బాకుల్లా భయంకరంగా వున్నాయి. బాకు చివర వున్న రక్తపు బొట్లల్లా వాళ్ళ చూపులూ ద్వేషాగ్ని జ్వాలల్తో ఎర్రగా మండిపోతున్నాయి.

“ఇదిగోరా! యిక్కడుందిరా! ఈ దొరసాని రెండు రోజులనుండి వెతుకున్నాం. అప్రాంతంవాళ్ళంతా చెప్పినట్లు బుద్ధిగా విని, వెళ్ళిపోయిరు. ఇది మాత్రం బింకంగా వుండిపోయింది. మొండిరకం!... పట్టుకోండిర!.... వదలకండి..... అహ్హాహా!....” అంటూ గుండెలవిసేలా నవ్వాడు ఆ మూకకి నాయకుడైన గళ్ళలుంగి పెద్దమనిషి.

భయంకరమైన నవ్వులతో పిచ్చి అరుపులతో వాళ్ళంతా మీదకి వురికారు. ఒకడు పైటలాగాడు. మరొకడు గుండెలు ముద్దెట్టుకున్నాడు. ఇంకోడు బుగ్గ కొరికాడు. వేరొకడు చెయ్యిపట్టుకున్నాడు.

కరుణమ్మ ఒళ్ళంతా తాచుపాములు పాకినట్లుయింది. కెవ్వుమని అరిచింది. పిచ్చి భయంవేసింది. ఆ భయంతో ఏదో తెలియని తెగింపు, ఆవేశం ఆమెలో ప్రవేశించాయి. అంతే ప్రాణాలకి తెగించి వాళ్ళని ఎదుర్కొంది. ఒళ్ళు తెలి

మని కోపంతో వాళ్ళ జుట్టు పీకింది. మొహాలు రక్కేసింది అందినవాళ్ళ చేతుల్ని కరిచింది.

దాంతో వాళ్ళకి కోపం వచ్చిపోయింది. కరుణమ్మ మీాద కక్ష బయలుదేరింది. ఆమె కరుస్తూంటే ఆ బాధకి తట్టుకోలేక ఒకడు కర్రెత్తి ఆమె నెత్తిమీాద కొట్టాడు. కరుణమ్మ తల చిట్లిపోయింది. ఒక్కమారుగా కక్కుకున్నట్టు రక్తం తలలోంచి కిందికి ఒలికింది. అదే సమయంలో ఆమె కరిచిన చేతిలోంచికూడా రక్తపు చినుకులు రాలి నేలమీాద పడ్డాయి. నేలమీాదపడ్డ ఆ రెండు రక్తాలకీ భేదంలేకపోవడం వల్ల కాబోలు పరస్పరం ఎంతో ఆప్యాయంగా కలిసిపోయి ఎర్రగా ఒకే నవ్వు నవ్వాయి.

రక్తం చూసేసరికి కరుణమ్మ కళ్లు బైర్లు గమ్మాయి. తలగిర్రున తిరిగిపోయింది. చాపచుట్టగా నేలమీాద పడబోయి వెంటనే ఆపుకొంది.

గుండెల్లో భీతి.

నరాల్లో ఇదీ అని చెప్పలేని ఏదో నీరసం.

పిచ్చి ఎత్తినట్లు ఓ పొలికేక పెట్టి దెయ్యం పట్టిన దానిలా పరిగెట్టింది. కరుణమ్మ రక్కులికి మొహం జేవురించి, కరుపులికి చేతులు వాచిపోయాయి. ఆ జనం అంతా కోపంతో వచ్చిపోయారు.

తరమండి!

కొట్టండి!

చంపండి! అంటూ జనం గావుకేకవేస్తూ. కరుణమ్మ వెనకాలే వద్దారు.

కరుణమ్మ పరిగెడుతోంది.

తన శక్తి కొలది పరుగెడుతోంది.

ప్రాణాలకి తెగించి మరీ పరుగెడుతోంది.

కానీ....కానీ....కళ్ళు తిరిగిబోతున్నాయి. కాళ్ళు తేలిపోతున్నాయి. అయినా పరుగెడుతోంది. వెనకాల వస్తూన్న జనానికి అందకుండా మరీ పరుగెడుతోంది.

అలా ఎంతసేపో, ఎంతసేపో....ఎంతసేపో.

లాభం లేదు.

ఊపిరి అందడం లేదు.

గొంతుకు ఎండిపోయింది. గుండె పట్టేసింది. కూలిపోతుంది. నేలమీదకి ఒ....రి....గి పోతోంది.

వచ్చేశారు....వెనకాల తరుముకొస్తూన్న జనం దగ్గర కొచ్చేశారు అమ్మో! కుక్కని బాధినట్లు బాధి చంపేస్తారు. ఎక్కడ దాక్కోవడం ఎక్కడ? ఇక్కడ ఏముంది....ఏముంది ఇక్కడ?....అదిగో అదేమిటి?.... ఏమిటది?

అందంగా అల్లిన పెద్ద పందిరి! ఆ పందిరిలో శత జయంత్యుత్సవ కారణంగా కొత్తగా వేసిన తెల్ల పాదరసం రంగులో మిలమిల మెరసిపోతున్న బాపూజీ శిలా విగ్రహం.

ఆ బొమ్మ ఎవరిది తెలియదు. తనుపుట్టాక అయిదారు నెలలకే, తనకిచిరునవ్వులతో స్వాగతంపల్కి- లోకం, ఆయనకి తుపాకీతో వీడ్కోలు చెప్పింది.

ఆయనెవరైతేనేం, భయంలేదని ధైర్యం చెప్తూ చేతి కర్రతో నడుస్తూ బోసినవ్వులతో పిలుస్తూన్నట్లు బతుక్కి ఆశనీ గుండెకి బలాన్నీ ఆలోచనకీ అమృతాన్నీ వర్షిస్తున్నారు.

కరుణమ్మ ఇంకేం ఆలోచించలేదు. రెండు అంగల్లో వెళ్ళి విగ్రహందగ్గర చాపచుట్టగా పడిపోయింది. రెండు చేతులూ చుట్టేసి బాపూజీ కాళ్ళను గట్టిగా కౌగలించేసుకుంది.

హా....మ్మ....య్య!

ఆ పందిరికింద చల్లని ఆ కాళ్ళ స్పర్శకి, కరుణమ్మ దివ్యానుభూతితో పరవశించిపోయింది. తలమీద పెద్దభారం దింపినట్లు శరీరం అంతా దూదిపింజెలా తేలితూంటే, బాహ్యలోకాన్ని మరిచి ఎక్కడికో, ఏ శాంతీ లోకాలవైపో ప్రాణం హాయిగా జారిపోతుంది.

ఇంతలో దెబ్బతిన్న పౌరుషంతో వెనకాల అరుచుకొచ్చిన మనుష్యులు రొప్పుకొంటూ రొజుకుంటూ అక్కడికి చేరుకున్నారు.

"ఒరెయ్ యిక్కడ దాక్కుందిరా!" అన్నాడొకడు.

"చూస్తావేంటి. కొట్రా" అన్నాడు నాయకుడు.

అంతే!

టప్పుమంది కరుణమ్మ తల. ధారగా వచ్చిన రక్తంతో బాపూజీ తెల్లని పాదాలు రంగు మార్చుకొన్నాయి. దెబ్బమీద దెబ్బగా కరుణమ్మ తలమీద బాదేశారు వాళ్లు.

అయినా కోపం తగ్గలేదు వాళ్ళకి. వీరావేశంతో ఊగిపోతున్నారు. ఆ దెబ్బలవల్ల కరుణమ్మకి స్పృహతప్పి పోయి ఉంటుందనైనా ఆలోచించకుండా "లే...ఆ విగ్రహాన్ని వదలి ఇవతలికి రా!...ఫూ!" అంటూ గట్టిగా అరిచారు.

కరుణమ్మకి ఆ అరుపు వినిపిస్తేగా? "ఏంలేవవూ"_ గర్జించాడు నాయకుడు. వుహూ!

నాయకుడి వళ్లు తెలియనంత కోపం వచ్చేసింది.

"దాన్ని లాగండిరా! ఆ విగ్రహం దగ్గర్నుంచి" అని తక్కిన వాళ్ళకి ఆజ్ఞాపించాడు.

వాళ్ళు లాగిచూశారు. చేతులు కాళ్ళూ, బిరబిగిసి పోయి పళ్లు గిట్టకరచుకు పోయి ఉన్నాయి. విగ్రహం కాళ్ళకి మేకులు వేసి తాపడం చేసేసినట్లు ఆమె చేతులు ఎంతపీకినా రాలేదు. తిరిగి తిరిగి ప్రయత్నం చేశారు. లాభంలేక పోయింది.

"అలా వస్తుందిరా అది? రణ పెంకి రకం. మీరు అందరూ పందిరి ఇవతలికి వచ్చేయండి. నే దాన్ని రప్పిస్తా" అంటూ నాయకుడు పందిరికి నిప్పు అంటించాడు. మంట నెమ్మదిగా వ్యాపించి ఒక్కమాటుగా భగ్గుమని అంటుకుంది.

పెద్ద పెద్ద మంటలు.

భయంకరమైన పొగలు.

కాలి పెళ్ళున బద్దలవుతూన్న వెదురు గెడలూ, చుర చుర లాడుతూ కాలిపోతున్న తాటాకులూ.

మంటలు పొగలు చప్పుళ్ళు.

ఒహో!

జాజ్వల్యమానంగా పందిరి మండిపోతుంది.

ఆ భయంకరమైన వేడికి కాలిపోయి బాపూజీవిగ్రహం రంగులు మార్చుకోసాగింది.

పైన వేసిన తెల్లని రంగంత పెట్లిపోయింది.

దాంతో నల్లగా అయి, విగ్రహం వికృతంగా మారి పోయింది.

మంటలు ఇంకా విగ్రహాన్ని కాల్చేస్తున్నాయి.

విగ్రహం ఆకుపచ్చగా మారింది.

క్రమంగా కాల్చిన ఇనుముల ఎర్రగా మారుతోంది.

పందిరి ఇంకా మండిపోతూనే వుంది.

కరుణమ్మ ఆ అచేతన స్థితిలోనే కాలిపోతోంది. చేతులు నల్లగా బొగ్గులయిపోతున్నా విగ్రహం కాళ్ళని మాత్రం వదలలేదు.

మంటలు ఇంకా పైకి లేచాయి.

బాపూజీ విగ్రహం నీలంరంగులోకి కరిగిపోతోంది.

మంటలు నాలికలు చాపుతూ ఆకాశానికి లేస్తున్నాయి.

బాపూజీ విగ్రహంలోని రంగు లింకా మారుతునే ఉన్నాయి. నీలిరంగు లోంచి లేత పసుపు రంగులోకి లేత రంగులోంచి ముదురు రంగులోకి, అందులోంచి బంగారం లాంటి పసిమి రంగులోకి, పసిమి రంగులోంచి ఇంకాపచ్చగా

ఇంకా పచ్చగా మారి-పచ్చగా మారి...ఇంకా మారి...ఇంకా మారి...పెద్దశబ్దంతో ఢామ్మని బద్దలైంది. బాపూజీ విగ్రహం.

పందిరి అంటించిన జనం అదిరిపడ్డారు.

అస్తమిస్తున్న సూర్యుని ఎర్రని కాంతిలో మహా జ్వాలంలా మండిపోతున్న వందలాది ఆకుల బాపూజీపందిరి, లోకహితం కోసం గరళాన్ని మింగిన సదాశివుని జ్వాలా తోరణంలా ప్రళయ భయంకరంగా కనిపించింది.